పిల్లి గుడిసెలు కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్‌ బిన్‌ అబ్దుల్లా బలాల

చార్మినార్‌: పిల్లి గుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్‌ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట్‌ ఎమ్మెల్యే అహ్మద్‌ బిన్‌ అబ్దుల్లా బలాల అన్నారు. ఐసీడీఎస్‌ చార్మినార్‌ ప్రాజెక్ట్‌ సీడీపీఓ పావని ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇటీవల శంకర్‌నగర్‌ బస్తీకి చెందిన మూసీ నిర్వాసితులతో పాటు ఇప్పటికే నివసిస్తున్న వారందరి సౌకర్యార్థం కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు ఆయన స్పష్టం చేశారు.

త్వరలో బస్తీ దవాఖానా సైతం..

తమ కాలనీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయించాలని పిల్లిగుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు సయ్యద్‌ మస్తాన్‌, తాహెర్‌ అలీ, పిల్లి రాంచందర్‌, పిల్లి ప్రసాద్‌, యూసూఫ్‌, ఘనీ తదితరులు ఎమ్మెల్యే అహ్మద్‌ బలాలను కోరారు. స్పందించిన ఆయన అక్కడే ఉన్న కార్పొరేటర్‌ సలాం షహీద్‌కు చెప్పి మెడికల్‌ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. సాధ్యమైనంత వెంటనే బస్తీ దవాఖానా ఏర్పాటు చేయిస్తామన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను కలిసిన టీజీఓ రాష్ట్ర కార్యవర్గం



సుల్తాన్‌బజార్‌: తెలంగాణ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ గెజిటెడ్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్‌లు, కార్యదర్శిగా సునీల్‌ రాజ్‌, అసోసియే ట్‌ అధ్యక్షుడిగా ఎస్‌.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుడి ఎ.చంద్రప్రకాష్‌, కోశాధికారిగా నామాల శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ సెంట్రల్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, కార్యదర్శి జి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మెడికల్‌ అండ్‌ హెల్త్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆర్‌వీ కర్ణన్‌ కమిషనర్‌ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖని, డైరెక్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్‌ డాక్టర్‌ రవీందర్‌ రాథోడ్‌, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌ డాక్టర్‌ అజయ్‌కుమార్‌, తెలంగాణ వైద్య విద్య డైరెక్టర్‌ డాక్టర్‌ వాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. సెంట్రల్‌ యూనియన్‌ అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ బి.శ్యామ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ జగన్‌మోహన్‌రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


డివైడర్‌పై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌రావు

లంగర్‌హౌస్‌: డివైడర్లపై వాహనాలతో దాటడం, రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై కఠిన చర్యలు తప్పవని టోలిచౌకి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌ రావు అన్నారు. ప్రమాదకరంగా డివైడర్లపై నుంచి వాహనాలతో దాటుతూ ప్రమాదాల బారిన పడుతుండటంతో వాటి నివారణకు ఆయన ఆధ్వర్యంలో గురువారం పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ముఖ్యంగా డివైడర్‌పై నుంచి దాటుతున్న సంగం ఆర్మీ చెక్‌పోస్ట్‌ నుంచి టిప్పుఖాన్‌ బ్రిడ్జి వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని జరపకుండా తీగలతో కడుతూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ..అత్తాపూర్‌ వైపు నుంచి వచ్చేవారు టిప్పుఖాన్‌ బ్రిడ్జి వద్ద యూటర్న్‌ తీసుకోకుండా మధ్యలో ప్రమాదకరంగా డివైడర్‌పై నుంచి వాహనాలు పోనిస్తున్నారన్నారు. వీటి నివారణకు శాశ్వతంగా గ్రిల్స్‌ ఏర్పాటుకు పై అధికారులకు దరఖాస్తు పెట్టామన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మహ్మద్‌ రహ్మత్‌ అలీని సత్కరిస్తున్న ఉద్యోగులు

అబిడ్స్‌: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి ముందుంటానని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీఓల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌ రహ్మత్‌ అలీ పేర్కొన్నారు. నూతనంగా మహ్మద్‌ రహ్మత్‌అలీని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం మహ్మద్‌ రహ్మత్‌ అలీ మాట్లాడుతూ..దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనను ఎన్నుకున్న ఉద్యోగులందరికీ, మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హరిప్రసాద్‌, దేవులపల్లి శ్రీనివాస్‌, మధు, శ్రీనివాస్‌ ప్రసాద్‌, అబ్దుల్‌ మాలిక్‌, రవీంద్రనాయక్‌, సునీల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గడ్డం శ్రీనివాస్‌, మిర్యాల పురుషోత్తమ్‌, స్వామి పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌, డ్రగ్స్‌కు బానిసవ్వొద్దు


మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్‌ డీసీపీ బాలస్వామి

సుల్తాన్‌బజార్‌: విద్యార్థులు పవిత్రమైన వైద్య వృత్తిలో నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ ర్యాగింగ్‌, డ్రగ్స్‌ లాంటి దురాలవాట్లకు బానిసవ్వొద్దని ఈస్ట్‌ జోన్‌ డీసీపీ బాలస్వామి సూచించారు. ఉస్మానియా మెడికల్‌ కళాశాల ఆధ్వర్యంలో గురువారం కోఠి మెడికల్‌ కళాశాల ఆడిటోరియంలో డ్రగ్స్‌, ర్యాగింగ్‌ అనే అంశాలపై నూతనంగా జాయిన్‌ అయిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీసీపీ బాలస్వామి హాజరై విద్యార్థులకు ర్యాగింగ్‌, డ్రగ్స్‌ వల్ల జరిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు విద్యార్థి దశలో తమ భవిష్యత్తుకు కావాల్సిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా చేరే విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నరేంద్రకుమార్‌, అడిషనల్‌ డీసీపీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌చారి, ఎస్‌ఐలతో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలంగా ఉందని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. గురువారం కార్వాన్‌లో డివిజన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత పార్లమెంట్‌ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో తమ పార్టీ 8 స్థానాలు గెలిచి సత్తా చాటిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక బీజేపీకి ప్రజల మద్దతు పెరిగిందన్నారు. మహిళల కోసం క్షేత్ర స్థాయిలో ఎలాంటి పథకం ప్రవేశపెట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్‌, డిజ్వర్‌సింగ్‌, కట్ల అశోక్‌ ఉన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయాలి


తాహెర్‌ బిన్‌ అమ్దానిని సత్కరిస్తున్న ఇస్మాయిల్‌ అన్సారీ

నాంపల్లి: ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయాలని తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు మహ్మద్‌ ఇస్మాయిల్‌ అన్సారీ అలియాస్‌ ఉర్దూ అన్సారీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హజ్‌హౌస్‌లో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ అమ్దానిని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌ అన్సారీ మాట్లాడుతూ..ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులకు నగదు పురస్కారాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కార్యదర్శి లియాకత్‌ అలీ, ప్రొఫెసర్‌ సుల్తానా ఖాన్‌, సూపరింటెండెంట్‌ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాడు జోరు.. నేడు బేజారు!

- పాతబస్తీలో రాను రాను తగ్గుతున్న బంగారం వ్యాపారం
- కోట్ల రూపాయల పెట్టుబడి.. అయినా పరేషాన్‌
- పాతబస్తీ వీడుతున్న బంగారం, వెండి, ముత్యాల వ్యాపారం


గిరాకీ లేక వెలవెలబోతున్న గుల్జార్‌హౌజ్‌లోని ఓ బంగారం దుకాణం

చార్మినార్‌: నగరంలో 400 ఏళ్ల క్రితం బంగారం వ్యాపారం అంటేనే పాతబస్తీ..నిజాం కాలం నుంచి పాతబస్తీలో కొనసాగుతున్న బంగారు, వెండి, ముత్యాల వ్యాపారాలకు ప్రస్తుతం కష్ట కాలమొచ్చింది. అసలే బాటిల్‌ నెక్‌ రోడ్లు..దీనికి తోడు సరైన పార్కింగ్‌ సౌకర్యం లేకపోవడంతో పాతబస్తీలో బంగారం వ్యాపారం తగ్గింది. చిన్న వ్యాపారాలు రూ.50 లక్షల నుంచి పెద్ద పెద్ద షో రూం వ్యాపారులు రూ.10 కోట్ల నుంచి 50 కోట్ల వరకు పెట్టుబడి పెట్టి తమ వ్యాపారాలను కొనసాగించాల్సి ఉంటుంది. ఇంత పెట్టుబడి పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నా ఇక్కడి వ్యాపారులకు మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయి. దీంతో పాతబస్తీలోని దుకాణదారులు తమ వ్యాపారాలను నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పార్కింగ్‌, ట్రాఫిక్‌ రద్దీ ప్రధాన సమస్య..

పాతబస్తీలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో పాటు కార్లు, భారీ వాహనాలను పార్కింగ్‌ సమస్య, నిత్యం ట్రాఫిక్‌ రద్దీ పాతబస్తీలో బంగారం, వెండి, ముత్యాల వ్యాపారాలను దెబ్బ తీస్తున్నాయి. వీటిని ఎక్కడ పార్క్‌ చేయాలో తెలియక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఇక్కడి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన పార్కింగ్‌ సౌకర్యం లేకపోవడంతో రానురాను తమ వ్యాపారాలు కుంటుపడుతున్నాయంటున్నారు. సరైన పార్కింగ్‌ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడమే కాకుండా నిత్యం వాహనాల రద్దీతో పాటు రోడ్లపై నెమ్మదిగా కదిలే వాహనాలు పాతబస్తీలోని బంగారు, వెండి, ముత్యాల వ్యాపారాలకు అడ్డుగా మారాయి.

నిజాం కాలం నుంచి..

ఒకప్పుడు చార్మినార్‌ పరిసరాల్లో బంగారం, వెండి, ముత్యాల వ్యాపారం చేసుకోవడానికి నిజాం సర్కార్‌లో అప్పటి నిజాం స్వయంగా కొంత మందిని ఉత్తర భారత దేశం నుంచి రప్పించినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. నిజాం కాలం నుంచి చార్మినార్‌, గుల్జార్‌హౌజ్‌, కాలికమాన్‌, చార్‌కమాన్‌, ఘాన్సీబజార్‌, శాలిబండ, సిద్దిఅంబర్‌ బజార్‌ తదితర ప్రాంతాల్లో దాదాపు 300 వరకు దుకాణాలుండేవి. ప్రస్తుతం 50–100 దుకాణాలకు తగ్గిపోయాయి. వీరంతా తమ తమ వ్యాపారాలను నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లి అక్కడ తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారు. బంగారు, వెండి ఆభరణాలను తయారు చేసి ఇవ్వడానికి పని చేసే వలస కార్మికులు సరైన ఆర్డర్లు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

పాతబస్తీలో వ్యాపారాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి..



మదీనా నుంచి చార్‌కమాన్‌–చార్మినార్‌ వరకు వ్యాపారాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. దుకాణాల ముందు తమ వాహనాలను పార్కింగ్‌ చేసుకోవడానికి సరైన స్థలాలు లేకపోవడంతో అటు వ్యాపారులతో పాటు ఇటు వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌ రద్దీతో పాటు సరైన పార్కింగ్‌ సౌకర్యం లేకపోవడంతో పాతబస్తీ వ్యాపారాలు తమ వ్యాపారాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

– నాగ్‌నాథ్‌ మాశెట్టి, భవానీ జువెల్లర్స్‌ గుల్జార్‌హౌజ్‌

తపాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: తపాల శాఖ విశ్రాంత ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం డాక్‌సదన్‌ వద్ద ఉద్యోగులు మౌనదీక్షతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తపాల శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి దుర్గాప్రసాద్‌ మాట్లాడుతూ..విశ్రాంత ఉద్యోగుల పోరాటంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కె.మనోహర్‌, రవికృష్ణ, యాదగిరి, కారుణ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మూసీ నిర్వాసితులకు రుణాల అందజేత


యుగంధర్‌రెడ్డి

చార్మినార్‌: జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోన్‌ పరిధిలోని పిల్లి గుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్‌ కాలనీలోని మూసీ నిర్వాసితులకు సెల్ఫ్‌ హెల్ప్‌ గ్రూప్‌ (ఎస్‌హెచ్‌జీ)ల ద్వారా శుక్రవారం ఆర్థిక సాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసింది. యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఆర్థిక సహకారంతో స్వయం సహాయక బృందాలకు ఈ వడ్డీ లేని రుణాలను అందజేయడానికి శ్రీకారం చుట్టింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–6 యూసీడీ ప్రాజెక్ట్‌ అధికారి యుగంధర్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది ఇప్పటికే 11 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయగా.. వాటన్నింటిని స్థానిక యూబీఐ మేనేజర్‌తో పాటు ఇతర బ్యాంక్‌ అధికారులు పరిశీలించారు. 10 మంది చొప్పున 10 గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూప్‌కు దాదాపు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్‌ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో ఒక్కో గ్రూప్‌ సభ్యురాలికి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ప్రజాభవన్‌లో అందజేయనున్నామని యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరు సెల్‌ఫోన్‌ దొంగల అరెస్టు

నాంపల్లి: రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్లను దొంగలించిన ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం నాంపల్లి రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫాం–4 మీద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా కీసర, శివాజీనగర్‌కు చెందిన శ్రీహరి కుమారుడు డ్రైవర్‌గా పని చేసే ముదావత్‌ శివ నాయక్‌(28), వికారాబాద్‌ జిల్లా కేసారం గ్రామానికి చెందిన నర్సింహులు కుమారుడు, కార్మికుడు డప్పు మహేష్‌ బాబు (23) ఈ నెల 16న నాంపల్లి రైల్వే స్టేషన్‌లో క్యాంటీన్‌ నడుపుతున్న జయప్రకాష్‌శర్మ తన మొబైల్స్‌ను కౌంటర్‌లో ఉంచి కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఇదే సమయంలో యువకులిద్దరూ కౌంటర్‌లో ఉంచిన సెల్‌ఫోన్లను దొంగలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద ఉన్న నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న టీచర్లు

లంగర్‌హౌస్‌: సుఖః ప్రసవం జరగాలంటే గర్భిణులు నిత్యం యోగా, వ్యాయామాలు చేయాలని డీహెచ్‌డబ్ల్యూ ఝాన్సీ దీపిక అన్నారు. లంగర్‌హౌస్‌ హరిదాస్‌పురలో గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఝాన్సీ దీపిక మాట్లాడుతూ..గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాలు, వ్యాయామాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం అంగన్‌వాడీ టీచర్లపై ఉందన్నారు. నిర్ణీత సమయంలో గర్భిణులు వైద్య పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, 55 మంది గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి


పురస్కార గ్రహీతలతో డాక్టర్‌ కె.వి.రమణాచారి, హెచ్‌.జె.దొర

నాంపల్లి: నటుడు దుగ్గిరాల సోమేశ్వరరావు 92వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను గురువారం రాత్రి తెలుగు యూనివర్సిటీలో రసరంజని హైదరాబాద్‌, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్‌ నటులు సీహెచ్‌.నారాయణ స్వామి, కేతినీడి నటరాజ్‌ సత్కళా భారతి సత్యనారాయణ, టీవీనటి డాక్టర్‌ బి.హెచ్‌.పద్మప్రియకు దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాలను అందజేశారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రసరంజని వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్‌ డీజీపీ హెచ్‌.జె.దొర, విశ్రాంత ఐఏఎస్‌ అధికారి డాక్టర్‌ కె.వి.రమణాచారి సభా ప్రారంభకులుగా, దర్శకులు బి.ఎమ్‌.రెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరై గ్రహీతలకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ కె.వి.రమణాచారి మాట్లాడుతూ..నాటక రంగంలో దుగ్గిరాల సోమేశ్వరరావుకు ఒక గొప్ప శిఖరమని కీర్తించారు. రసరంజని సంస్థ ఉపాధ్యక్షులు ముట్నూరి కామేశ్వరరావు పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సభానంతరం ఆకురాతి భాస్కర చంద్ర రచించిన ఎస్‌.ఎం.భాషా దర్శకత్వంలో మిత్ర క్రియేషన్స్‌ హైదరాబాద్‌ వారిచే ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు'నాటిక ఆకట్టుకుంది.

వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శం


మాట్లాడుతున్న ఎస్‌.డి.ఎం సుభాని

నాంపల్లి: తొలుత బోయవానిగా జీవించి తదనంతరం ఆదికవిగా, మహర్షిగా అవతరించిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సింగరేణి జనరల్‌ మేనేజర్‌ కో ఆర్డినేషన్‌ ఎస్‌.డి.ఎం సుభాని పేర్కొన్నారు. సింగరేణి భవన్‌లో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన సుభాని మాట్లాడుతూ..వాల్మీకి రచించిన రామాయణ గాథ జనులందరికీ ఎంతో ఆదర్శప్రాయమైందని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్‌ జనక్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ..కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనడానికి వాల్మీకి జీవితం ఒక చక్కటి ఉదాహరణ అన్నారు. జనరల్‌ మేనేజర్‌ మార్కెటింగ్‌ రవి ప్రసాద్‌ పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో..

గన్‌ఫౌండ్రీ: త్వరలో జరగబోయే సమగ్ర కులగణన సర్వేతో అన్ని వివరాలు తెలుస్తాయని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమగ్ర కులగణన సర్వే చేయడం వల్ల భవిష్యత్తులో ఎవరైనా కోర్టుకు వెళ్లినప్పుడు ఈ ఆధారాలు చూపిస్తే సరిపోయేలా ఉంటుందన్నారు. బోయ వాల్మీకీలను బీసీ–ఏ నుంచి ఎస్టీ జాబితాలోకి మార్చాలని అడుగుతున్నారని అందుకు రేపు జరుగబోయే కులగణన సర్వేలో తగు ఆధారాలను జత చేయాలని సూచించారు. బోయ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌ గౌడ్‌ తెలిపారు. అంతకు ముందు జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వాల్మీకి జయంతి ఉత్సవాల ఆహ్వాన కమిటీ సభ్యులు, వివిధ బోయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూ ఉస్మాన్‌ గంజ్‌లో..

అబిడ్స్‌: వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యూ ఉస్మాన్‌గంజ్‌లో ఆయన చిత్రపటానికి ఖైరతాబాద్‌ జిల్లా కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు ఎస్‌.ధన్‌రాజ్‌ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సమాజంతో పాటు సమాజ శ్రేయస్సుకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధరమ్‌వీర్‌, ఆకాష్‌ వాల్మీకి, విశాల్‌ వాల్మీకి, సతీష్‌ బిడ్ల తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో జిల్లా కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు ధన్‌రాజ్‌ తదితరులు

డాక్టర్‌ కె.లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు


లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫిరాసత్‌ అలీ బాక్రీ

చార్మినార్‌: బీజేపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా డాక్టర్‌ లక్ష్మణ్‌ను బీజేపీ జాతీయ ఎన్నికల అధికారిగా నియమించినందుకు బీజేపీ అధిష్టానానికి రాష్ట్రం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీజేపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీ అన్నారు. ఈ మేరకు డాక్టర్‌ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎంపీకి ఈ గౌరవ పదవి లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మహ్మద్‌ ఫహాద్‌కు సేవా అవార్డు



గోల్కొండ: సమాజ సేవలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌రైట్స్‌ ఆర్గనైజేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ నీమ్‌సింగ్‌ ప్రేమి అన్నారు. గురువారం అక్బర్‌బాగ్‌లోని కౌన్సెలింగ్‌ కార్యాలయంలో ఇన్‌చార్జి మహ్మద్‌ ఫహాద్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్న వయస్సులోనే మహ్మద్‌ ఫహాద్‌ ఉత్తమ సమాజ సేవకుడిగా ఎదగడం అతని అంకిత భావాన్ని తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో మహ్మద్‌ నజీబ్‌, జైన్‌సింగ్‌ తదితరులు ఉన్నారు.

'వాటర్‌బోర్డు సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం'


జీఎం జాన్‌ షరీఫ్‌తో సమావేశమైన ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో ఎలాంటి వాటర్‌బోర్డు సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని వాటర్‌బోర్డు 4వ డివిజన్‌ జనరల్‌ మేనేజర్‌ జాన్‌ షరీఫ్‌ పేర్కొన్నారు. బుధవారం గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ ఆయనను కలిసి బేగంబజార్‌తో పాటు నియోజకవర్గంలోని బేగంబజార్‌తో పాటు పలు ప్రాంతాల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జాన్‌ షరీఫ్‌ మాట్లాడుతూ..సంబంధిత మేనేజర్లు డీజీఎంలు పర్యటించి వాటర్‌బోర్డు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ..గోషామహల్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ సహకారంతో నియోజకవర్గంలో కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బేగంబజార్‌లో బీఆర్‌ఎస్‌ ముందుగా ఉండా ఎలాంటి సమస్యలైనా పరిష్కరిస్తామన్నారు.

ఎన్సూర్‌ ఆధ్వర్యంలో ప్రపంచ వెన్నెముక దినోత్సవం

గన్‌ఫౌండ్రీ: ఎన్సూర్‌ ఆధ్వర్యంలో ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెల్తీ స్పైన్‌–హెల్తీ క్యాంపేన్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వంద రోజుల పాటు ఎన్సూర్‌ ఆధ్వర్యంలో వెన్నెముక పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం వెన్నెముక సమస్యతో ప్రజలు బాధపడుతున్నందునా వారిని చైతన్య పరిచేందుకే ఎన్సూర్‌ హెల్తీ స్పైన్‌–హెల్తీ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిందని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలి


నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతున్న రమణరాజు తదితరులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలని ఆసిఫ్‌నగర్‌ మండలం గోల్కొండ జోన్‌ డిప్యూటీ డీఈఓ సీహెచ్‌వీ రమణరాజు అన్నారు. విజయనగర్‌కాలనీలోని డీఈఓ కార్యాలయంలో మండల పరిధిలో నూతన ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ రమణరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, పాఠశాలలను ఉన్నతమైన విద్యాలయాలుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. తమ మండల పరిధిలో 68 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు.

బాలుడి అదృశ్యం


మహ్మద్‌ రిజ్వాన్‌

అబిడ్స్‌: బాలుడు అదృశ్యమైన ఘటన బేగంబజార్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఫీల్‌ఖానాకు చెందిన మహ్మద్‌ రిజ్వాన్‌(14) ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి వారం రోజులు గడిచినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్థానిక ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకి లభించినచో 77996 08867 లేదా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

బాలుడిపై గుర్తుతెలియని యువకులు కత్తితో దాడి

జియాగూడ: బైక్‌ ఢీకొనడంతో గుర్తుతెలియని యువకులు ఓ బాలుడిపై దాడి చేసి పరారైనా ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సబ్జిమండి ప్రాంతంలో గురువారం సాయంత్రం జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ సునీల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన పవన్‌ (17) 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం జియాగూడలో ఉంటున్న బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. ఈ క్రమంలో సబ్జిమండికి వెళ్తున్న పవన్‌ మరో వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు బండిని పవన్‌ వాహనం తగిలింది. దీనితో ముగ్గురు యువకులు పవన్‌పై కత్తితో దాడి చేసి గాయపర్చి పరారయ్యారు. గాయపడిన పవన్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.